# మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


మాట్లాడుతున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి


సమావేశానికి హాజరైన మహిళా సంఘాల సభ్యులు

- ఉపాధి మార్గాలు ఎంచుకోవాలి
- అన్నిరంగాల్లో మహిళలకు ప్రాధాన్యం
- మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కోసం చట్టసభల్లో కొట్లాడింది బీఆర్‌ఎస్ మాత్రమే
- మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

రాయపోల్, అక్టోబర్ 3 : మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని మెదక్ ఎంపీ, దుబ్బాక నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని వీర్‌వీర్ గార్డెన్‌లో నిర్వహించిన మహిళా స్వయం సంఘాల సమావేశానికి ఎంపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని, అన్నిరంగాల్లో వారికి అవకాశాలు కల్పిస్తున్నారని తెలిపారు. మహిళలు ఉపాధి మార్గాలు ఎంచుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం కేసీఆర్ ముందుకుసాగుతున్నారని తెలిపారు. పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని చేసిన పోరాటంలో బీఆర్‌ఎస్ విజయం సాధించిందన్నారు. పార్లమెంట్‌లో మహిళా బిల్లు ప్రవేశపెట్టాలని మొదట డిమాండ్ చేసింది బీఆర్‌ఎస్సేనన్నారు. ప్రతి మండల కేంద్రంలో మహిళా సంఘాలతో సమావేశాలు నిర్వహించి వారి సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. గతంలో బ్యాంకర్లు రూ.5 లక్షల రుణాలు ఇచ్చేవారని, ప్రస్తుతం రూ.20 లక్షల వరకు రుణాలు ఇస్తున్నారని తెలిపారు. ఐకేపీ సిబ్బందికి వేతనాలు పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు అన్నిరంగాల్లో పెద్దపీట వేస్తున్న ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. పనిచేస్తున్న ప్రభుత్వానికి మహిళలు మద్దతు ప్రకటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటూ సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. సమావేశంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మహనోరావు, ఎంపీపీ సంధ్య, జడ్పీటీసీ రణం జ్యోతి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బండారు దేవేందర్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పూజిత, నాయకులు నమిలే భాస్కరాచారి, బంగారయ్య, ఏపీఎం కిషన్, మహిళా సంఘాల నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


బీల్యానాయక్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న జడ్పీటీసీ మంగ

## ఎంపీపీకి పితృవియోగం

హుస్నాబాద్ రూరల్, అక్టోబర్ 3 : హుస్నాబాద్ ఎంపీపీ మానస, జిల్లెలగడ్డ సర్పంచ్ లావుడ్య స్వరూప తండ్రి భూక్య బీల్యానాయక్ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న అక్కన్నపేట జడ్పీటీసీ మంగ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బీల్యానాయక్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మండలానికి చెందిన పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు ఎంపీపీ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ


మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న చంటి

చేర్యాల, అక్టోబర్ 3 : మున్సిపాలిటీ పరిధిలోని రోల్లబండకు చెందిన చింతల సత్తయ్య(62) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట నాయకులు చింతల రవి, పరశురాములు, కనకయ్య, మల్లయ్య, కొండయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

## బాలిక సంరక్షణ పథకం డబ్బులు చెల్లించాలి

చేర్యాల, అక్టోబర్ 3 : బాలిక సంరక్షణ పథకంలో డిపాజిట్ చేసిన డబ్బులు గడువు ముగిసినా చెల్లించడం లేదని పట్టణానికి చెందిన బుట్టి సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాటి పాలకులు ప్రవేశపెట్టిన బాలిక సంరక్షణ పథకంలో ఇద్దరు ఆడపిల్లలు ఉంటే వారి పేరిట రూ.5 వేలు బ్యాంకులో డిపాజిట్ చేస్తే 18 ఏండ్లు నిండిన తర్వాత రూ.20 వేలు ఇస్తామని విధివిధానాలు రూపొందించినట్లు తెలిపారు. దీంతో తన బిడ్డ బుట్టి ధరణి పేరిట 2002లో రూ.5 వేలు డిపాజిట్ చేశానని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మా అమ్మాయికి 18 ఏండ్లు దాటినా డబ్బులు ఇవ్వడం లేదన్నారు. డబ్బులు తీసుకునేందుకు సంబంధితశాఖ అధికారులు ఫైల్ పూర్తి చేసి డ్యాకుమెంట్స్ తనకు ఇచ్చారని, డబ్బుల కోసం బ్యాంకును సంప్రదిస్తే అసలు మీ అమ్మాయి పేరిట అకౌంట్ లేదని బ్యాంకు అధికారులు చెబుతున్నారని తెలిపారు. బాలిక సంరక్షణ పథకం డబ్బుల కోసం తాను 5 నెలలుగా బ్యాంకు, కార్యాలయం చుట్టూ తిరుగుతున్నానని, బ్యాంకు ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

# ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలి

హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్


ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్, అక్టోబర్ 3 : అక్కన్నపేట మండల కేంద్రంలో నేడు(బుధవారం) నిర్వహించనున్న బంజారా ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం హుస్నాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో గిరిజనుల కోసం అనేక అభివృద్ధి పనులు పూర్తి చేయడంతో పాటు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. సమ్మేళనం ద్వారా గిరిజనులకు కలిగిన లబ్ధి గురించి వివరిస్తామన్నారు. నియోజకవర్గంలో మొట్టమొదటిసారి నిర్వహిస్తున్న బంజారా సమ్మేళనానికి రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. గిరిజన విద్యాసంస్థలకు సంబంధించిన పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారన్నారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 54 గిరిజన తండాలు ఉన్నాయని, వీటిల్లో 13 తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. దాదాపు అన్ని గిరిజన తండాల్లో మౌలిక వసతులు కల్పించామని తెలిపారు. ఇటీవల గిరిజన తండాలకు తారు రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.30 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసిందన్నారు. హుస్నాబాద్ పట్టణంలో రూ.2 కోట్లతో బంజారా భవన్ నిర్మిస్తున్నామని చెప్పారు. రెండు మండలాల ఎంపీపీలు, ఒక జడ్పీటీసీ గిరిజన మహిళలు కావడం, ఇద్దరు మాజీ జడ్పీటీసీలు కూడా గిరిజన నాయకులే కావడం విశేషమన్నారు. రాజకీయంగా ప్రోత్సహించడమే కాకుండా గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేసేందుకు ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నామని తెలిపారు. సుమారు 5 వేల మంది గిరిజనులు ఈ సభకు హాజరవుతారనే అంచనా ఉందన్నారు. ఆత్మీయ సమ్మేళనానికి గిరిజనులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## జ్వరంతో చిన్నారి మృతి


పూదరి ప్రతీక (ఫైల్)

హుస్నాబాద్ రూరల్, అక్టోబర్ 3 : మండలంలోని పందిల్లలో తీవ్ర జ్వరంతో బాధపడుతూ చిన్నారి మృతి చెందింది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. పందిల్లకు చెందిన పూదరి సతీశ్ కుమార్తె ప్రతీక(6) నాలుగు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్నది. జ్వరం తగ్గకపోవడంతో సోమవారం సాయంత్రం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. చిన్నారి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## హుస్నాబాద్‌లో క్రీడాకారులకు కొదవలేదు

హుస్నాబాద్ టౌన్, అక్టోబర్ 3 : హుస్నాబాద్‌లో క్రీడాకారులకు కొదవలేదని మైనార్టీబాలికలు నిరూపించారని మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత అన్నారు. షార్ట్‌పుట్, హైజంప్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థినులు షేక్ హసీనాబేగం, ఎండీ సజీరను మంగళవారం ఆమె అభినందించారు. ఈ సందర్భంగా వైస్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఇటీవల సిద్దిపేట, గజ్వేల్‌లో నిర్వహించిన హైజంప్, షార్ట్‌పుట్ పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.


విద్యార్థినులను అభినందిస్తున్న వైస్ చైర్‌పర్సన్ అనిత

## తహసీల్దార్, ఎంఈవోకు వినతిపత్రం

చేర్యాల, అక్టోబర్ 3 : పెంచిన వేతనాలతోపాటు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరుతూ మంగళవారం తహసీల్దార్ రాజేశ్వర్‌రావు, ఎంఈవో నర్సింహారెడ్డిని మధ్యాహ్న భోజన కార్మికులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కళావతి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు చెల్లించాలని కోరారు.

# కేంద్ర ప్రభుత్వాన్ని గద్దెదించాలి

చేర్యాల, అక్టోబర్ 3 : రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దెదించాలని కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కొంగరి వెంకట్‌మావో పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని ముస్త్యాల గ్రామంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వెంకట్‌మావో మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ సర్కారు పంటకు కనీస మద్దతు ధర అమలు చేస్తానని చెప్పి, రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చిందన్నారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేట్ పరం చేయమని హామీ ఇచ్చి, ఇప్పుడు మోటర్లకు మీటర్లు పెట్టేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మేడిపల్లి చందు, రేపాక కుమార్, గుండ్ర రవీందర్, బైకన శ్రీనివాస్, బ్రహ్మయ్య, సహాదేవులు, రవి, నర్సింహులు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.


చేర్యాల : ముస్త్యాలలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

### మద్దూరులో కార్మికుల నిరసన..

మద్దూరు(ధూళిమిట్ట), అక్టోబర్ 3 : కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దెదించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌మావో ప్రజలకు పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా ఎస్‌కేఎన్ అక్టోబర్ 3ను బ్లాక్ డేగా ప్రకటించాలని పిలుపునిచ్చిన నేపథ్యంలో రైతు, కార్మిక సంఘాలతోపాటు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం మద్దూరు మండల కేంద్రంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వెంకట్‌మావో కేంద్రంలోని బీజేపీ సర్కారు తెచ్చిన రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని గతేడాది లకీంపూర్ ఖేరిలో రైతులు శాంతియుతంగా నిరసన చేశారని తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంపై కేంద్రమంత్రి అజయ్‌కుమార్‌మిశ్రా కుమారుడు తన కాన్వాయిని ఉద్దేశపూర్వకంగా తీసుకెళ్లి దాడి చేయడంతో నలుగురు రైతులతోపాటు పాత్రికేయుడు మృతి చెందినట్లు గుర్తు చేశారు. ఈ దాడికి కారణమైన కేంద్రమంత్రిని భర్తరఫ్ చేయాలని రైతులు ఉద్యమించినట్లు చెప్పారు. రైతుల ఉద్యమానికి దిగివచ్చిన కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేస్తామని చెప్పినప్పటికీ, ఆ హామీని ఇప్పటివరకు నెరవేర్చలేదన్నారు. విద్యుత్ కార్పొరేటీకరణను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ షఫీ, జక్కుల ఎల్లయ్య, బియ్య రాజయ్య, అల్ల రమేశ్, పల్లపు రాజయ్య, అయ్యాలం, పిట్టల నరేశ్, ఇట్టమైన పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.